# కథ

నీలాకాశంలో ప్రకాశిస్తున్న చంద్రుడు.. తన వెన్నెల వెన్నెలను ఆ ప్రదేశమంతా ఒలకబోస్తున్నాడు. ఆ వెన్నెల వెలుగులకు బిక్కబోయిన నక్షత్రాలు.. చంద్రుడితో పోటీపడలేక అతనికి దాసోహమన్నట్లుగా మిణుకు మిణుకుమంటున్నాయి. సముద్రతీరంలో కొందరు హాయిగా సేదతీరుతున్నారు. మరికొందరు యువతీయువకులు గుంపులు గుంపులుగా విహరిస్తున్నారు. కొంత మంది పిల్లలు ఇసుకలో ఆటలాడుతున్నారు.

అక్కడే కొంచెం దూరంగా వెల్లకిలా పడుకుని ఉన్న ఏడుకొండలు మనసులో సంతోషం సముద్రపు అలల్లా ఎగసెగసి పడుతున్నది. సముద్రం మీదినుంచి రయ్యిమంటూ వీచే గాలికి అతని తలవెంట్రుకలు చిందరవందరగా అవుతున్నా.. ఇసుక రేణువులు ఎగిరొచ్చి మీదపడుతున్నా అతను పట్టించుకోలేదు. పుట్టి బుద్ధెరిగినప్పటి నుంచీ అతనికి ఆట పాటలన్నీ ఆ సముద్రంతోనే! నురగలతో నాట్యం చేస్తున్న ప్రియనేస్తమైన సముద్రమంటే అతనికి తగని ఇష్టం. ఆ సముద్రం తర్వాత మళ్లీ అతనికి మరో ప్రియాతిప్రియమైన స్నేహితుడున్నాడు. అతనే ఓబులేసు. ప్రస్తుతం అతని మనసు సంతోషంతో ఉప్పొంగిపోవడానికి కారణం.. ఆ స్నేహితుని నుంచి ఫోన్ రావడమే. చిన్నతనంలో తనతో కలిసి పెరిగిన తన స్నేహితుడు ముంబయిలో ఉన్నాడని మాత్రమే అతనికి తెలుసు. ఎన్నో ఏళ్లుగా ఒక్కసారి కూడా కనిపించని ఓబులేసు.. తననెప్పుడో మరిచిపోయి ఉంటాడని అతను అనుకున్నాడు. అయితే.. 'అతని ఆలోచన అబద్ధం' అని రుజువు చేస్తూ ఒకరోజు అతనికో ఫోన్ వచ్చింది.

అతను లిఫ్ట్ చేసి..

''హలో.. ఎవురూ?'' అని అడిగాడు.

''ఎవరు మాట్లాడేది? ఏడుకొండలేనా?'' అవతల నుంచి ప్రశ్న వచ్చింది.

''అవును! తమరెవురు?'' అడిగాడతను.. కాస్త బెరుగ్గా.

''ఎవరేంట్రా.. నేను ఓబులేసుని. గుర్తుపట్టావా?'' అన్నాడు అవతలి వ్యక్తి.

చిరపరిచితమైన ఆ గొంతు వినగానే అతనికి ఒక్కక్షణం నోట మాట రాలేదు. మెల్లిగా గొంతు పెగుల్చుకుని..

''ఎవురూ? ఓబులేసు గారేనా?'' అనడిగాడు.

''ఒరే ఫూల్! 'గారు' ఏంట్రా? నేను నీ స్నేహితుణ్నిరా. నన్ను 'ఒరే ఓబులేసు' అని పిలవరా'' అని వినిపించడంతో అతను ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

''నువ్వా.. నువ్వేనా? నేన్నీకు గుర్తున్నానా?'' అనుమానంగా అడిగాడు.

''గుర్తుండటానికి నిన్నసలు మర్చిపోతే గదరా! నేను వచ్చే బేస్తవారం నిన్ను కలవడానికి మన ఊరికి వస్తున్నా. అందుకే ముందుగా చెప్తున్నా'' అన్నాడు.

''అలగలాగే! నీకోసం ఎయిటింగ్ సేస్తుంటా!'' అన్నాడు ఏడుకొండలు.

ఓబులేసు వస్తున్నాడన్న సంతోషంలో అతని కాలు ఒకచోట కుదురుగా నిలవలేదు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలు అతని మనసులో సుడులు తిరగసాగాయి.

* * *

పక్కపక్క ఇళ్లలో పుట్టిన ఏడుకొండలు, ఓబులేసు మధ్య బాల్యంనుంచే విడదీయరాని బంధం ఏర్పడింది. చిన్నప్పుడు మామిడి తోపుల్లో కాయలు దొంగతనం చేసి పంచుకున్న దగ్గర్నుంచీ, సముద్రం ఒడ్డున ఇసుకలో ఆడుతూ పాడుతూ కబుర్లు చెప్పుకొన్న వారి స్నేహం సముద్రంకన్నా లోతైనది. ఒకరికోసం ఒకరు ప్రాణం ఇచ్చేంతగా గాఢ స్నేహం వారి మధ్య అల్లుకుంది.

చిన్నతనంలోనే తమ కులవృత్తి అయిన చేపలు పట్టడం కూడా ఇద్దరూ కలిసే నేర్చుకున్నారు. పెద్దవాళ్లతో కలిసి ఇద్దరూ సముద్రంలోకి వేటకు వెళ్లేవారు. ఏ పనిచేసినా, ఎక్కడ చూసినా ఇద్దరూ కలిసే కనిపించేవాళ్లు. వాళ్ల వయసుతోపాటే వాళ్ల స్నేహం కూడా దినదిన ప్రవర్ధమానమైంది.

పన్నెండేళ్ల వయసులో ఇద్దరూ సముద్రంలోకి వేటకు వెళ్లారు. వాళ్లు సొంతంగా వేటకు వెళ్లడం అదే మొదటి సారి. వారి తండ్రులు చెప్పిన జాగ్రత్తలు పాటిస్తూ, ఇద్దరూ వేట పూర్తిచేసి తిరిగి రావడం.. గూడెం వాళ్లందరిలోనూ ఆనందాన్ని నింపింది. సముద్రం మీద వాళ్లు ఆడింది ఆటగా, పాడింది పాటగా చేపల వేట సాగేది.

ఒకరోజు ఎప్పటిలాగే సముద్రంలోకి వెళ్లారు. అయితే ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే సముద్రం ఆరోజు భీకర రూపం దాల్చింది. అప్పటికే వాళ్లు తీరంనుంచి చాలా దూరం లోపలికి వెళ్లిపోయారు. ఒక్కసారిగా సముద్రం అల్లకల్లోలమైంది. వాళ్ల పడవ తలకిందులైంది. ఇద్దరూ నీళ్లలో చెరొకవైపు పడిపోయారు. ఇద్దరూ ఈదుతూ తమ పడవ దగ్గరికి చేరుకున్నారు. అయితే ఏడుకొండలు పడవ ఎక్కుతుండగా ఒక పెద్ద అల అతణ్ని మళ్లీ సముద్రం లోపలికి లాగేసింది. అది గమనించిన ఓబులేసు ఎంతో చాకచక్యంతో వ్యవహరించి, అతణ్ని పడవలోకి లాఘవంగా లాగేశాడు. ఓబులేసే గనక లేకుంటే.. ఏడుకొండలు జీవితం ఆ రోజుతో ముగిసిపోయి ఉండేది. ఆ సంఘటన తర్వాత వాళ్ల మధ్య స్నేహం మరింత బలపడింది.

అయితే ఒకానొక దుర్దినాన ఒక అనుకోని ప్రమాదంలో ఓబులేసు తల్లిదండ్రులు మరణించడంతో, అతని మనసు వికలమైపోయింది. ఎవరెంత చెప్పినా వినకుండా ఊరొదిలేసి ఎటో వెళ్లిపోయాడు. దొరికిన చోట, దొరికిన పనల్లా చేస్తూ చివరికి ముంబయి చేరుకున్నాడు. రకరకాల పనులు చేస్తూ అక్కడే స్థిరపడిపోయాడు. అదృష్టవశాత్తూ ఓబులేసు చేపట్టిన వ్యాపారం కలిసి వచ్చి, అతనికి విపరీతమైన లాభాలను తెచ్చిపెట్టింది. దాంతో అనతికాలంలోనే అంచెలంచెలుగా పైకెగబాకాడు. క్రమేణా అతని కనుసన్నల్లో ఒక పెద్ద వ్యాపార సామ్రాజ్యమే ఏర్పడింది.

అలాంటి గొప్పవాడు తనకోసం ప్రత్యేకంగా ముంబయి నుంచి వస్తుండటంతో ఏడుకొండలు సంతోషానికి హద్దులేదు. అతను చెప్పిన వార్త విని గూడెం వాళ్లంతా ఎంతో సంతోషించారు.

మిత్రుడు వస్తున్న విషయం భార్యకు చెప్పి..

''ఆనికి మనింట్లోనే భోజనం ఏర్పాటుసెయ్యి. సిన్నప్పుడు రొయ్యల ఇగురు శానా ఇట్టంగా తినేటోడు. గాబట్టి అది సెయ్యటం మర్సిపోవొద్దు'' అని చెప్పాడు ఏడుకొండలు.

''మీ దోస్తు గురించి నువ్వింతగనం సెప్పాల్నా? ఓబులేసన్న అంటే నీకెంత ఇట్టమో ఎన్నిసార్లు నువ్వు సెప్పలేదు నాకు. అదంతా నేను సూసుకుంటా'' అని భరోసా ఇచ్చిందామె.

* * *



**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.5 వేల బహుమతి పొందిన కథ.**